క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 45–50, బెండ 40, కాకర 50, దొండ 30, దోస 35, ఆలు 25, చామ 80, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 25, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- కళ్యాణి గార్డెన్, మాతృశ్రీనగర్, మాధవనగర్, శ్రీలా, దుర్గామాత, విశ్వంబర్ ఫీడర్ పరిధి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- హైదర్‌నగర్ పెట్రోల్ పంప్, మియాపూర్ ప్రధాన రోడ్డు, కల్వరి టెంపుల్, మెట్రో రైల్వేస్టేషన్, ఎస్ఎంఆర్, డ్రీమ్ వ్యాలీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, బి.నగర్ ఫేజ్ కాలనీ, సీబీసీఐడీ, డైమండ్ హిల్స్, డాక్టర్ కాలనీ, ఫేజ్ 2 ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

మియాపూర్: సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సాయిఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీకి చెందిన శ్రీ కృష్ణ కుమార్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల రూపాయల చెక్కును ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, వివేకానందనగర్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కోనేరు ప్రసాద్, రఘునాద్, చంద్రమోహన్ సాగర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జెండా పండుగ

పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పల్లె నుండి పట్నం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రతీ కార్యకర్త, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 25వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రతి గ్రామం, వార్డుల్లో పార్టీ జెండాలను ఎగరవేయాలని, ఉదయం 10 గంటల కల్లా పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశ స్థలికి చేరుకోవాలని సూచించారు. మహాసభకు 8 వేల మంది ప్రతినిధుల హాజరు లక్ష్యం అని , ప్రతి గ్రామం, వార్డు, డివిజన్ల నుండి భారీ సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలని ముఖ్య నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు



హనుమాన్‌నగర్లో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు యోగానంద్

ఆల్విన్‌కాలనీ: ప్రజలకు అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించడంలో విఫలమైన ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ హనుమాన్‌నగర్లో ఆదివారం యోగానంద్ పాదయాత్ర చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌యస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి శూన్యం అని ఆరోపించారు. అబద్ధపు హామీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముఖ్యమంతి కేసీఆర్ మారారని తెలిపారు. ఇక నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాంధీ భూకబ్జాలతో కోట్లకు కోట్లు దోచుకుంటున్నారని దుయ్యబట్టారు.కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు మహేందర్, బీజేపీ నాయకులు రాజేష్, నరేందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, అక్కినపల్లి సాయికుమార్, గోవర్ధన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో పరేషాన్..



హఫీజ్‌పేట్‌లోని సాయికాలనీలో నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు



కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మంచినీటి బోరు పైపులు, ఫ్యూజ్ బాక్సు



అంతర్గత రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- సాయి కాలనీలో పనిచేయని బోర్లు
- అంతర్గత రోడ్లు అంతంత మాత్రమే..
- చెత్త తొలగించేవారేరీ..
- రోడ్డు మధ్యలో ట్రాన్‌ఫార్మర్

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని సాయికాలనీలో బోర్లు, విద్యుత్, నాలాలు, పారిశుధ్య తదితర సమస్యలు నెలకొన్నాయి.

- గతంలో తాగునీటి సమస్య వస్తే అత్యవసర పరిస్థితుల్లో మంచినీటి బోర్లు వేసి ప్రత్యేక పైప్ లైన్ను ట్యాంకులకు కలిపేవారు. బస్తీలోని ప్రధాన చౌరస్తాలలో కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందించేవారు. ఇప్పుడు మిషన్ భగీరథ నీటిని ప్రజలు వాడుతున్నారు.
- ఒకవేళ మిషన్ భగరథ నీరు రాకపోతే వేసవిలో ప్రత్యామ్నాయంగా ఈ మంచినీటి బోర్ల ద్వారా నీరు అందించవచ్చు. కాలనీలో ఓపెన్ నాలాలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- ఇక అంతర్గత రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.
- మంచినీటి బోర్ల వద్ద ఉన్న మోటార్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి.
- ఓపెన్ నాలాలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని ప్రతిరోజు తొలగించేలా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

బోర్లు బాగు చేయాలి



మంచినీటి బోర్లు, ట్యాంకులను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలి. వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా మంచినీటి ట్యాంకులు ఉపయోగపడతాయి.

–జీవన్, సాయి కాలనీ

ట్రాన్స్‌ఫార్మర్‌తో భయంగా ఉంది



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– రాజు, హఫీజ్‌పేట్

నాట్య ఉత్సవ్



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గురు నృత్యాలయం గురువు నల్లమోలు శ్రీలక్ష్మీశిష్యబృందంచే నాట్య ఉత్సవ్ పేరిట కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణేశ వందనం, బ్రహ్మాంజలి, జతిస్వరం, దశావతారం, రామదాసు కీర్తన, శివస్తుతి, కళింగనర్తన, తిల్లాన, అన్నమాచార్య కీర్తనలు తదితర అంశాలను కళాకారులు వంశిక, హరిణి, లాస్య, జస్మిత, తపస్య, ప్రియాంక, ఆరోహి, వైష్ణవి, ఐశ్వర్యలు ప్రదర్శించారు.

– మాదాపూర్

మియాపూర్‌లో బస్తీ నేస్తం



బస్తీ నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూకాలనీలో ప్రభుత్వ పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా న్యూ కాలనీ, ఓంకార్‌నగర్ కాలనీకి సంబంధించి బస్తీ నేస్తం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా దంత, కంటి,చర్మ వైద్య పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులు కష్టపడి చదవాలని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరివర్తన్ పరివార్ ఫౌండేషన్ నిర్వాహకులు వినయ్ వంగల, లెర్నింగ్ ఫేస్ ఫౌండేషన్ నిర్వాహకులు కౌముది, అమృత ఫౌండేషన్ నిర్వాహకులు సునీషా, అర్చన ఆస్పత్రి, స్మార్ట్ సీజన్ ఐ హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి...

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ ఆఫీసు సమీపంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఆదివారం మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ...వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించటంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సెర్ప్ నుండి ఐడెంటీ కార్డులు, యూనిఫాం, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సెక్రటేరియట్ ,ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, యువరాజ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం తెలంగాణ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పారిశ్రామిక రంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణల మూలంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు ఆలవాలంగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులో శ్రీ బయో ఈస్తటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రి బయోటిక్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాలుష్యరహిత పరిశ్రమల కోసం ప్రత్యేకంగా సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ డివైస్ పార్కులో అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పాటు కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. పారిశ్రామిక రంగానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులను ఒకే చోట ప్రభుత్వం కల్పిస్తుండడంతో, నూతన పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడి సాధించేందుకు మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్, పరిశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు పంపిణీ

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని బుట్ట కన్వెన్షన్ డీఎస్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ ,చైర్మన్ నరేష్ చౌదరి, ఎమ్మెల్యే గాంధీలు వీల్‌చైర్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్‌సీ చైర్మన్ డి.సురేష్‌చౌదరిని కొనియాడారు.కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రామచందర్, బాలరాజు, సంతోష్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గచ్చిబౌలి: ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాదాపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ పరిధిలోని కేటీఆర్ కాలనీలోని 5, 6 గల్లీల వాసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ గల్లీలో ప్రతి వర్షాకాలం వరదనీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయిన్ నాలాను నిర్మించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ నాయకుడు చంద్రగిరి సతీష్, కేటీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాఘవేంద్రరావు, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఎనిమిది కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందరికి నెగటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

దొంగతనాల నివారణపై పోలీసుల ప్రచారం



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ నరసింహారావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వేసవి సెలవుల్లో ఊరికి వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రాపురం పోలీసులు మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందుకు సంబంధించిన ప్రచార వాహనాన్ని ఇటీవల మియాపూర్ ఏసీపీ నరసింహారావు ప్రారంభించారు.ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో కాని ఇంట్లో రహస్య ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సూచించారు. అవసరమైతే రాత్రి సమయంలో స్నేహితులను కాని బంధువులు కానీ ఇంట్లో ఉండే విధంగా చూసుకోవాలని, లేని పక్షంలో స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంటికి తాళం వేసినప్పుడు అది బయటకు కనిపించకుండా కర్టెన్ వేయడంతో బాటు రాత్రి సమయంలో ఇంటి బయట లైటు వేయాలన్నారు. ముఖ్యంగా బయటకు వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో షేరు చేయడం మంచిది కాదని అన్నారు.

బహిరంగ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



గచ్చిబౌలి: చేవెళ్లలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ సభకు భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలి వెళ్లారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఎం .రవికుమార్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, వసంత్‌యాదవ్, హన్మంత్ నాయక్, లక్ష్మణ్ ముదిరాజ్, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కేపీహెచ్‌బీ కాలనీ: అలిమేల్‌మంగ, పద్మావతి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి 26 వ తేది వరకు శ్రీల ప్రైడ్ పార్కులో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.కొండల్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం 24వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు సుప్రభాత సేవ, 7.30 గంటలకు విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్యోపాసన, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మియాపూర్: డీసీఎం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దశరథ్ తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్‌కు చెందిన మల్కప్ప(34)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరు నగరానికి వచ్చి బౌరంపేట్‌లోని సింహపురి కాలనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మల్కప్ప దౌల్తాబాద్‌లో పని నిమిత్తం బౌరంపేట్ నుండి స్ప్లెండర్ ద్విచక్ర వాహనంపై ఉదయం 4 గంటలకు బయలుదేరారు. ఈ క్రమంలో మియాపూర్‌లోని ఆల్విన్ క్రాస్ జాతీయ రహదారిపై మియాపూర్ నుండి చందానగర్ వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుండి మల్కప్ప ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మల్కప్ప డీసీఎం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చిట్కుల్‌లో చోరీ

రూ. 30 లక్షల విలువ చేసే బంగారం, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు



ఇంట్లోని బీరువా పగలగొట్టిన దృశ్యం

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ జరిగింది. రూ.30 లక్షలు విలువ చేసే బంగారం, నగదును ఎత్తుకెళ్లిన సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్ కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 19వ తేదీ ఉదయం తమిళనాడు కామాక్షి అమ్మవారి దేవాలయంకు వెళ్లి,అక్కడి నుండి తిరుమల వెళ్లారు.తిరిగి శనివారం రాత్రి 11 గంటలకు ఇంటికి రాగా సందులో ఉన్న మరో తలుపు తెరిచి ఉండటంతో మొదటి అంతస్తులోకి వెళ్లి చూడగా రెండు రూమ్‌ల్లో బీరువాలు పగలగొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి.దీంతో రవీందర్ కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్టు గుర్తించారు. కాగా ఇటీవల ఏడు గుంటల భూమి అమ్మగా వచ్చిన నగదుతో పాటు రూ.30 లక్షల విలువ చేసే బంగారంను దొంగలు ఎత్తుకెళ్లిన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు, క్లూస్ టీం ఘటనాస్థలంను సందర్శించారు.బాధితుడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయం



పటాన్‌చెరులో బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



హుడా కాలనీలో.. వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: చందానగర్‌లోని హుడా కాలనీలో శ్రీ బసవేశ్వర జయంతిని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌లు హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీలోని 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దొంతి శేఖర్, నరేందర్, భాను తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి: కుల, మత, వర్గ భేదాలు లేవని చాటి చెప్పిన మహాత్మా బసవేశ్వరుని జయంతిని ఆదివారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో నిర్వహించారు. కమాండెంట్ పి.మురళీకృష్ణ బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పటాన్‌చెరులో...

పటాన్‌చెరు: సమాజంలో అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని, ఆయన సూచించిన విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.మహాత్మ బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకొని.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ జాతీయ రహదారి పక్కన గల అశ్వారూఢ బసవేశ్వరుడి విగ్రహానికి కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, తెల్లాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాముల గౌడ్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పొగాకు బసవేశ్వర్, నాయకులు, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.